క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


హారిక

బేతంచెర్ల: పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూలు విద్యార్థిని హారిక ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ట్రిపుల్ ఐటీ ఒంగోలుకు ఎంపికైందన్నారు. పదో తరగతి పరీక్షలలో 568 మార్కులు సాధించడంతో ట్రిపుల్ ఐటీలు సీటు లభించిందని చెప్పారు. ఎంపిక ఎంఈఓలు సోమశేఖర్, అబ్రహాం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నేత్రదానం


నేత్రాలు దానం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని జెండాపేట కాలనీకి చెందిన కందగడ్డల సత్యనారాయణమ్మ (69) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలి కుమారుడు మధు పుల్లయ్య, కుమార్తెలు హేమలత, లక్ష్మి ప్రసన్న తమ తల్లి నేత్రాలు దానం చేస్తామని లైఫ్ యువనేత్ర సేవా సమితి వారికి సమాచారమిచ్చారు. వారు కర్నూలు ప్రభుత్వాసుపత్రి సిబ్బందికి సమాచారం ఇవ్వగా మృతురాలి నేత్రాలను సేకరించి, కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అందుకున్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


దుర్గాదేవి

డోన్ టౌన్ : పాతబస్టాండ్‌లోని శ్రీ విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేకంగా ఆలంకరించి విశేష పూజలు జరిపించారు. పట్టణంలోని పలువురు భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

'ఉపాధి' జేఈ మృతి


సంజీవరాయుడు(ఫైల్)

డోన్ టౌన్ : ఉపాధి హామీ పథకం డోన్ మండల జేఈగా విధులు నిర్వహిస్తున్న సంజీవరాయుడు (55) లివర్ సంబంధిత వ్యాధితో శుక్రవారం కర్నూలులోని ఆయన నివాసంలో మృతి చెందారు. ప్యాపిలి మండలంలో దాదాపు నాలుగున్నర సంవత్సరాలు పని చేసిన మృతుడు మూడు నెలల క్రితం డోన్‌కు బదిలీపై వచ్చారు. మృతి గురించి తెలుసుకున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఫక్రుద్దీన్ సాహెబ్, ఏపీఓ షుకూర్, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ సాదిక్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు కర్నూలుకు వెళ్లి మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి


మాట్లాడుతున్న కరీంబాషా

కోవెలకుంట్ల: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరీంబాషా, సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కమ్యూనిస్టు కొండారెడ్డి స్మారక భవనంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మాట తప్పడం తగదన్నారు. స్మార్ట్‌మీటర్లను తొలగించి, పెంచిన చార్జీలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నాగేశ్వరరావు, కత్తి ఓబులేసు, దేవరాజు, ఓబయ్య, రామచంద్రరాజు, నవీన్, రఘు, సుబ్బారెడ్డి. త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి


ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ సునీత

బేతంచెర్ల: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని డోన్ వ్యవసాయ శాఖ ఏడీఏ సునీత తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఏఓ విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ- క్రాప్ నమోదును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. పంటల నమోదుతో కలిగే ఉపయోగాలను రైతులకు వివరించాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

డోన్ టౌన్ : స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ,స్కూల్ హెచ్‌ఎం పురుషోత్తం అన్నారు. బాల గంగాధర్ తిలక్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని నలంద పాఠశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి విద్యార్థులకు ఆయన పోరాటాలను వివరించారు.

ధీమా ఇవ్వని బీమా!

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పైనే..
- దరఖాస్తులు స్వీకరించిన కూటమి ప్రభుత్వం
- పేరు మార్పుతోనే పథకం సరి
- మృతుల కుటుంబాలు ఎదురు చూపులు

గత ఎన్నికల సమయంలో అధికారం కోసం ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ మాత్రం అమలు చేయలేకపోతోంది. గత వైఎస్సార్‌సీపీలో అమలు చేసిన పథకాల పేర్లు మార్చడం తప్ప చేసిందేమీ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుటుంబ పెద్ద మృతిచెందితే ఆర్థిక భరోసా కల్పిస్తామన్న చంద్రన్న బీమా పథకాన్ని కూడా అమలు చేయలేకపోతోంది. దీంతో అకాల మరణం చెందిన వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి.

– బనగానపల్లె రూరల్

వైఎస్సార్‌సీపీ హయాంలో ఎంతోమందికి అండగా నిలిచిన వైఎస్సార్ బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమాగా పేరు మార్చి చేతులు దులిపేసుకుంది. ఆ తర్వాత కనీసం పథకం విధి విధానాలను కూడా ఇప్పటి వరకు ప్రకటించలేదు. ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదశాత్తూ మృతిచెందితే రూ.10 లక్షలు ఇస్తామన్న కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంత వరకు అతీగతీ లేదు. కనీసం పథకం వెబ్ సైట్ ఇంత వరకు ఓపెన్ కాలేదు. మృతి చెందిన కుటుంబ సభ్యుల దరఖాస్తుల స్వీకరణకు విధివిధానలు కూడా ప్రకటించకపోవడంతో యజమానులను కోల్పోయిన కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ పాలనలో బడుగు బలహీనవర్గాల కుటుంబాల్లో 18–50 ఏళ్ల వయస్సు ఉన్న వారు, 50–60 ఏళ్ల వయస్సు లోపు వారు మృతి చెందింతే రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు బీమాను వైఎస్సార్‌బీమా పేరుతో ప్రభుత్వం మంజూరు చేసేది. మృతి చెందిన కుటుంబ సభ్యుల ఇంటి వద్దకు వలంటీర్లు వెళ్లి వారి అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయం కింద రూ.10వేలను అందించేవారు. మిగిలిన మొత్తాన్ని 15–20 రోజుల్లో మృతుడి నామిని వ్యక్తిగత ఖాతాల్లో జమయ్యేది. ఈ బీమాను కూడా ప్రభుత్వమే చెల్లించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా చంద్రన్న బీమాను సక్రమంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రామ సచివాలయ కార్యాలయం

పథకాన్ని అమలు చేయాలి



కుటుంబ సభ్యులను, యజమానులను కోల్పోయిన పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీమా పథకాన్ని అమలు చేయాలి. వైఎస్సార్‌సీపీ హయాంలో మృతుల కుటుంబాలకు బీమా సొమ్ముఖాతాల్లో జమ చేసి పేదలకు అండగా నిలిచింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పథకాన్ని నీరుగార్చడం తగదు. – **అంబటి రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు**

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

డోన్ టౌన్ :స్థానిక కొండపేటలో వెలసిన శ్రీ రేణుకా ఎల్లమాంబేశ్వరి అమ్మవారికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిన్నకేశవయ్యగౌడ్ సతీమణి 14వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి పట్టువస్త్రాలు సమర్పించి ప్ర త్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించినట్లు తెలిపారు.

ప్రత్యేక పూజలు..

పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వద్దనున్న నాగలాపురం సుంకులమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, మంగళ హారతులు, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.

ఆగని స్టార్టర్, విద్యుత్ తీగల చోరీలు

సంజామల: మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో వరుసగా మోటార్ స్టార్టర్ విద్యుత్ తీగల చోరీలు రైతులను ఆందోళకు గురిచేస్తున్నాయి. కొద్ది నెలల క్రితం 30 మంది రైతుల వ్యవసాయ మోటార్ల స్టార్టర్ బాక్స్‌ల వైర్లు చోరీకి గురైన సంగతి తెలిసిందే. తాజాగా గురువారం రాత్రి రెడ్డిపల్లె గ్రామంలో ఎర్ర పాలాలు రస్తా వైపు మరో 30 మంది రైతుల విద్యుత్ మోటార్ల స్టార్టర్ వైర్లు చోరీకి గురైనట్లు బాధిత రైతులు శుక్రవారం తెలిపారు. పోలీసులు స్పందించి చోరీలకు పాల్పడిన వారిపై గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలి


బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా,డివిజన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని హాస్టళ్లలో వసతులు కల్పించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలోని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు పద్మావతిని కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో వసతులు లేవని, కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, మెనూ ప్రకారం భోజనం, నిద్రించేందుకు గదులు, మంచాలు లేవని చెప్పారు. సమస్యలపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన అమె వసతి గృహాలను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు శివకృష్ణ,శ్రీనివాసులు,వెంకటరమణ ఉన్నారు.

స్పౌజ్ పింఛన్ల పంపిణీ

కొలిమిగుండ్ల: పింఛన్ తీసుకుంటు భర్త మృతి చెందితే ఆపింఛన్‌ను భార్యకు స్పౌజ్ పింఛన్‌లు జూన్12న ఇస్తామని ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. తర్వాత వాయిదాలు వేస్తు వచ్చారు. పింఛన్ సొమ్మును పంపిణీ చేయకుండా నిలిపివేశారు. ఎట్టకేలకు ఆగష్టులో సాధారణ పింఛన్‌లతో పాటు స్పౌజ్ పింఛన్‌లు ఇచ్చారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 122 మందికి పింఛన్‌లు ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పింఛన్‌లకు చెందిన వెబ్‌సైట్ తెరుచుకోక పోవడంతో అర్హులైన లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. దివ్యాంగుల పింఛన్‌లకు ఇటీవలనే రీవెరిఫికేషన్ చేశారు. మండలంలో చాలా మందికి నోటీసులు అందకపోవడం, సచివాలయ సిబ్బంది సమాచారం ఇవ్వక పోవడంతో ఈనెలలో కొంత మందికి పింఛన్ సొమ్ము పంపిణీ చేయలేదు. అంత వరకు హోల్డ్‌లో ఉంచనున్నారు. రీవెరిఫికేషన్‌కు హాజరైతేనే పింఛన్ సొమ్ము అందనుంది.

బిడ్డకు ముర్రుపాలు తాపించాలి




ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, బుగ్గానిపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: పుట్టిన వెంటనే శిశువుకు తల్లి ముర్రుపాలు తాపించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, లక్ష్మీశైలజలు సూచించారు. శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ప్రాజెక్టు నుంచి పట్టణంలోని పెట్రోల్‌బంకు వరకు అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమన్నారు. ముర్రుపాలల్లో వ్యాధి నిరోధకశక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పద్మజ పావని పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల:గర్భిణులు, చిన్నారులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గానిపల్లె గ్రామంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ తిప్పమ్మ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ 3 – 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆట పాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తామని చెప్పారు. అప్పుడే పుట్టినబిడ్డకు తల్లి ముర్రుపాలు తాపించడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో శుక్రవారం ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. 112, పోక్సో యాక్ట్, సైబర్ నేరాలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 1930 గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత బ్యాంకు ఖాతా, ఆధార్, ఓటీపీ, తదితర వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వరాదన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ అనిల్‌కుమార్, ఏఎస్‌ఐ మద్దిలేటిరెడ్డి పాల్గొన్నారు.

4 నుంచి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 4 నుంచి మూడు రోజుల పాటు నంద్యాల పట్టణంలో పీడీఎస్‌యూ విద్య, వైజ్ఞానిక రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన పద్మావతినగర్ ఆర్చి నుంచి రామకృష్ణ డిగ్రీ కళాశాల వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. 5, 6 తేదీల్లో జేకే ఫంక్షన్ హాల్‌లో ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యారంగం వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు జునైద్ బాషా, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, నాయకులు సతీష్, మనోజ్, రమణ, కిరణ్, రాజు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్

మహానంది: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మహానందిలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డితో కలిసి ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఏఈఓ మధు, సూపరిండెంట్లు నీలకంఠేశ్వరాజు, సుబ్బారెడ్డి ఉన్నారు.

'సుపరిపాలన.. తొలిఅడుగు'కు స్పందన కరువు

బేతంచెర్ల: మండలంలోని గూటుపల్లె, హుసేనాపురం, రహిమానుపురం, నాగముళ్లకుంట గ్రామాల్లో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి శుక్రవారం సుపరిపాలన..తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. అయితే గూటుపల్లె, రహిమానుపురం గ్రామాల్లో కార్యక్రమానికి స్పందన కరువైంది. మండల నాయకులు, గ్రామంలోని ఇద్దరు, ముగ్గురు నాయకులతో కార్యక్రమం నిర్వహించారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఆధిపత్యం నిరుపించుకోవాలనే కార్యక్రమం నిర్వహించారని మిగతా నాయకులు ఆవేదన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లో పింఛన్లు మంజూరు చేయాలని, సీసీ రోడ్లు వేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.

ధర్నాకు తరలిరండి

డోన్ టౌన్ : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్‌ల వద్ద చేపట్టనున్న ధార్నాకు ఉపాధ్యాయులు తరలివచ్చి విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం సంఘం జెండా ఆవిష్కరణ చేసి సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయలకు బోధనేతర పనులను రద్దు చేయాలని, పీఆర్సీ, పెండింగ్ డీఏల మంజూరు, సరెండర్ లీవ్ బిల్లులయ గ్రాట్యుటీ ఫండ్ తదితర డిమాండ్ల సాధనకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బారాయుడు, మండల అధ్యక్షుడు లక్ష్మీనాయక్, నాయకులు ప్రసాద్‌రెడ్డి,శ్రీనివాసరెడ్డి ,గంగాధర్ ఉన్నారు.

పింఛన్ల మంజూరు

బనగానపల్లె రూరల్: మండలంలో శుక్రవారం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఇందిర తెలిపారు. సామాజిక పింఛన్లతోపాటు కొత్తగా మంజూరైన 180 స్పౌజ్ పింఛన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని రాళ్లకొత్తూరు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగు నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు.. సీతమ్మ తండాకు చెందిన నాగునాయక్ జీవాన్ని మోటార్ సైకిల్‌పై పెట్టుకొని బనగానపల్లె సంతకు బయలుదేరాడు. మార్గమధ్యలో రాళ్లకొత్తూరు సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ప్రమాదంలో నాగునాయక్ కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బనగానపల్లె ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బనగానపల్లె పోలీసులు తెలిపారు.

కుందూనదిలో ఆటోడ్రైవర్ గల్లంతు?

బండిఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ముర్తుజావలి హుసేన్ శుక్రవారం కుందూనదిలో గల్లంతైనట్లు సమాచారం. కుటుంబ సభ్యులు అతని కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రం సమీపంలో సుమారు 30వేల క్యూసెక్కుల నీటితో కుందూనది ప్రవహిస్తోంది. ఈక్రమంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆటో డ్రైవర్ ముర్తుజావలి హుసేన్ తన ఆటోను శుభ్రం చేసుకునేందుకని నది వద్దకు వెళ్లాడు. రాత్రి తొమ్మిది గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నది వద్దకు వెళ్లి చూడగా ఆటోలో దుస్తులు, సెల్‌ఫోన్ ఉన్నాయి. ప్రమాదవశాత్తూ నదిలో గల్లంతై ఉంటాడనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైభవంగా స్వాతి వేడుకలు


ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండలంలోని వైష్ణవ క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసంను పురస్కరించుకొని స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలా చక్రవర్తి , కళ్యాణ్ చక్రవర్తి శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవ, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశస్నపనం, నరసింహ హోమం, పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం, ధన్వంతరి మూలమంత్ర జపం చేశారు. అలంకారప్రియుడైన స్వామి వారిని దేవేరుల సమేతంగా సహస్రదీపాలంకరణ సేవ కనుల పండువగా జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ మాఢ వీధుల్లో గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ


చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవ కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకుల ఉదయం చౌడేశ్వరిదేవికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

గురుకుల పాఠశాలలో కుక్కల భయం


విద్యార్థుల చెంతనే కుక్కలు


భోజనం చేస్తుండగా వచ్చిన కుక్క

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని గుత్తి రోడ్డులో నున్న మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు కుక్కల బెడద తీవ్రమైంది. ఈ విషయంపై పలుమార్లు స్కూలు సిబ్బంది మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కుక్కల బెడద తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం భోజన సమయంతో పాటు ఇతర వేళల్లో కూడా కుక్కలు పాఠశాలలో సంచరిస్తుంటాయని దీంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వంట ఏజెన్సీ మార్పులో రాజకీయం


ఎంఈఓ సోమశేఖర్, సూపరింటెండెంట్ దస్తగిరి బాబుతో వాగ్వాదం చేస్తున్న తల్లిదండ్రులు


పిల్లలను పాఠశాలకు పంపించమని చెబుతున్న తల్లిదండ్రులు

- కొమ్మూరి కొట్టాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ఆకలి కేకలు
- పాతవారిని తొలగించరు.. కొత్తవారిని తీసుకోరు!

బేతంచెర్ల: అధికారం మాది.. మేం చెప్పినట్టే నడుచుకోవాలని టీడీపీ నాయకులు వ్యవహరిస్తుండగా.. వారికి అధికారులు వత్తాసు పలుకుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొమ్మూరి కొట్టాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో రాజకీయం చోటు చేసుకొని 35 మంది విద్యార్థుల కడుపులు మాడుస్తుండటంతో పాత వంట ఏజెన్సీ నిర్వాహకురాలిని తొలగించాలని, లేకపోతే తమ పిల్లలను పాఠశాలకు పంపమని తల్లిదండ్రులు తెగేసి చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గత నెల 3న హెచ్‌ఎం జ్యోత్స్న.. తల్లిదండ్రులు, ఎంఈఓ సోమశేఖర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ పిల్లలకు అన్నం అరకొరగా పెడుతున్న నాగలక్ష్మమ్మను తొలగించాలని కోరారు. ఆమె స్థానంలో హెడ్ కుక్ కాశమ్మ, అసిస్టెంట్ కుక్‌గా ప్రభావతిని వారి అభిప్రాయం మేరకు ఎంపిక చేశారు. అయితే వారిని విధుల్లోకి తీసుకునేందుకు నెల రోజుల నుంచి కాలయాపన చేస్తున్నారు.

ఏజెన్సీ నిర్వాహకురాలి తొలగింపులో ఒత్తిళ్లు..

విద్యార్థులకు అన్నం సక్రమంగా పెట్టని వంట ఏజెన్సీ నిర్వాహకురాలు నాగలక్ష్మమ్మను తొలగించామని, ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్తగా ఎంపిక చేసిన వారు వంట చేయాలని ఎంఈఓ సోమశేఖర్.. హెచ్‌ఎం జ్యోత్స్నకు సూచించారు. తల్లిదండ్రుల ఆమోదంతో ఎంపిక చేసిన హెడ్‌కుక్ కాశమ్మ, అసిస్టెంట్ కుక్ ప్రభావతి వంట చేయాలని హెచ్‌ఎం గురువారం తెలిపారు. కానీ శుక్రవారం ఉదయం రాజకీయ ఒత్తిడితో మీరు వంట చేయరాదని హెచ్‌ఎం చెప్పారు. వద్దన్న పాత వంట ఏజెన్సీ నిర్వాహకురాలు వంట చేసింది. రాజకీయ నాయకుల ఒత్తిడితో ఎంఈఓ సైతం నిర్ణయం తీసుకోకపోవడంతో పాఠశాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో సంఘటనా స్థలానికి పోలీసులు, ఎంఈఓ చేరుకొని మండల కేంద్రానికి వస్తే ఎంపీడీఓ, తహసీల్దార్ సమక్షంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు ఎంపీడీఓ కార్యాలయం చేరుకోగా సూపరిండెంట్ దస్తగిరి బాబు, ఎంఈఓ మాట్లాడుతూ ఎంపీడీఓ సెలవులో ఉన్నారని, సోమవారం ఎంపీడీఓ , తహశీల్దార్ అందుబాటులో ఉంటారని అంత వరకు వేచి ఉండాలని చెప్పారు. సక్రమంగా వంట చేయకపోయినా టీడీపీకి చెందిన వారు కావడంతో రాజకీయ కారణాలతో పాత నిర్వాహకురాలిని కొనసాగించడంతో శనివారం నుంచి తమ పిల్లలను పాఠశాలకు పంపమని తల్లిదండ్రులు అధికారులకు తెగేసి చెప్పారు.